# మాయ

'గోర్లై పోనాదండి!'

'మరి కాదేటండి?'

'లచ్చ రూపాయల రొక్కవండి, ఈశడు ఎండండి, వొంద కాసులు బంగారవండి'

'అవునండి అచ్చంగా వొంద కాసులండి'

'ఆ బావు సొంతవేటి గాదండి, నిక్కచ్చిగా వూర్ల పెజల సొమ్మండి, తాకట్టు ఇడుకున్న బాపతండి'

'సిమ్మాసెలంగోరిదండి, ఆరేనండి పెసిడెంటు సిమ్మాసెలం గోరేనండి'

'సిమ్మాసెలం గోర్ని సిన్తనంల సిమ్మాలు గోడనే వోరండి'.

'అమ్మా అయ్యా నేరండి అనాదెదవండి'

'గోసీ ఎట్టుకొని గొడ్లు దోలుకునే వోడండి'

'ఈఁడో సుట్టు గరువు మీదకు గొడ్లు దోలుకెల్లడం కావయ్యగోరు సూసేరండి'

'కావయ్యగోరు ఊర్ల పెద్ద బూకామందండి – పాతికెకరాల పల్లవండి. పదెకరాల మెట్టండి. అయిదెకరాల మావిడితోటండి – నాలుగుజతల ఎడ్లండి. రెడు జతల పోతులండి మరి జతపాడి గేదెలండి'.

'కావయ్యగోరి ఇల్లాలు కావమ్మగోరు దొడ్డ మడిసండి. అవుపిస్తే సేతులెత్తి మొక్కాలండి, తొలికోడి కూతకే లెగిసి తానవాడి దేవుడికి దీపవెట్టందే గంగ ముట్టదండి. పేదోల్లకి ధరమం సేస్తదండి.'

'ఏటి సేసినా ఏట్నాబవండి? ఆరికి మొగబిడ్డడు నేడండి. ఒక్కూతురండి. అల్లుడి గోర్ని ఇల్లరికం ఇడుకుందావంటే ఆరుండనేదండి.'

'పట్నంల కసేరీ ఉజ్జోగవండి.'

'సిమ్మాలు గోడ్ని సొంత బొట్టెడులా సూసుకునేవోరండి కావమ్మగోరు. ముప్పొద్దుల కూడెట్టేవోరండి. మంచి గుడ్డలండి. ఈడు ఆరి పెంపకంల దొరబిడ్డలా గుండేవోడండి. నాలుగచ్చరం ముక్కలొచ్చేయండి.'

'ఈడు సేతికందేక కావయ్యగోర్ని ఏ పనీ సెయ్యనిచ్చేవోడు గాదండి. అటు యవసాయం ఇటు గొడ్ల పనీ ఈడే సూసుకునే వోడండి.'

'ఓ పొద్దు పొలాని కెల్లినోడు మరి దిరిగి రానేదండి. ఏటై పోనాడో తెల్దండి. వోరం దినాలు నల్దిక్కులూ ఎదికించేరండి పీకర్నేదండి.

'ఆ టయాంల కావమ్మగోరు బోసానంల ఎట్టిన నా సొమ్ములు పోనాయంటూ పిరంగీ ఒగ్గీసినారండి.'

'కన్నారెట్టిన బాలలొాడుగండి. ఈ పొద్దు ఆటికి కాల్చొచ్చీసినాయండి.'

'సోరీ యిసయం యిని అమ్మాయిగోరు, అల్లుడుగోరూ పట్నం నుండి పారొచ్చీసినారండి.'

'పోలీసు టానాల కేసెట్టీమన్నారండి అల్లుడుగోరు. కావమయ్యగోరు అడ్డెట్టీసినారండి.'

'సిమ్మాలు గోడు సోరీ సేసేడంటే కావమ్మగోరు వొప్పటం నేదండి.'

'ఏ పొద్దుకైనా ఆడెక్కడున్నా సోరీ అయిన సొమ్ము వొడ్డీతో సగా వొసూలు సేసి అత్తమ్మకిస్తానని బరోసా యిచ్చేరండి అల్లుడుగోరు.'

'సిమ్మాలు గోడు ఎల్లిపోయినాక కావయ్యగోరికి సెయ్యి తెగ్గోసీసినట్టయిందండి.'

'కావమ్మగోరు దిగులెట్టీసుకున్నారండి.'

'రెండెలచ్చన్లు ఎల్లిపోనాయండి.'

'కావయ్యగోరు కాలం సేసీసినారండి. కావమ్మగోరు ఆమట్న ఇల్లు పొలం బేరం ఎట్టీసి డబ్బిటుకొని కూతురు కాడకు పట్నం ఎల్లిపోనారండి.'

'సిమ్మాలు గోడు సిమ్మాసెలంగోరయి ఊర్ల దిగీసినాడండి.'

'అత్తా కోడలంచు పంచె సిలకట్టండి, సిలుకు కవీజండి, సేతికి వాచీ అండి, కిర్రుసెప్పులండి.'

'వూర్ల కావయ్యగోరి ఇల్లు, పొలం సొంతం సేసీసుకున్నాడండి. ఏడాద్దిరక్కుండా పెసిడెంటు గోరయేడండి.'

'వూర్ల పెజలందరికీ ఎండి, బంగారం కుదవెట్టీసుకుని అప్పులిచ్చేవోడండి.'

'ఆరికాడ సొమ్ము లోడుకుంటే గుమ్మిలో దిగీసినట్టే మరి పైకి రానేడండి.'

'ఆ టయాంల గేమ సేవిక సత్తెవతమ్మగోరు వూర్ల మకాం ఎట్టీసినారండి.'

'ముందల కవలమ్మ గోరుండీ వోరండి. ఆయమ్మ డూటీ సరీగా సేసేవోరు గాదండి. నెలకోపాలి సుట్టం సూపుల వొచ్చి పెసిడెంటు గోరింటికాడో సెయిర్మను గోరింటికాడో గూకోని వరాసికాలాడత సిట్టారాసేసి ఎల్లిపోయే వోరండి. ఆయమ్మ సెయిర్మిను గోరి మడిసండి. అంచాత ఇదేటని అడిగేవోరు నేరండి.'

'మరి ఈయమ్మ ఇసయం ఏరండి. శానా మంచోరండి. డూటీ టయాంల

పేసేస్తరండి.'

పెందిల వూర్ల గడప గడపకీ దిరిగి గుంటల్ని బడికి తోలెత్తదండి. బడికెల్లే వోరకూ వొగ్గదండి.

'పెద్దోల్లకి నైటు బడండి.'

'ఊరు బొమ్మని కాదు రమ్మంతంది. ఈ వొయసల మాకు సదువేటి? సదూకొని మావేటి ఉజ్జోగాలు సెయ్యాలని శానామంది మొరాయించే వోరండి. ఆరికంటె మొండి మడిసండి ఈయమ్మ.

'వోరయ్య! సదూనేందీ సచ్చినా పెమాదవే. నువు సొరగంల ఎల్లాలంతే గేటుకాడ సంతకం సెయ్యాల. లేకుంతేలోని కొగ్గరు అంటూ నవుతాలాడతూ నైటు బడికి తొల్తదండి. వూర్ల పెజలకి సత్తెవతి గోరి మీద ఇసవాసం గుదిరిందండి. ఆ యమ్మ సెప్పందీ ఏటీ సెయ్యరండి. కట్టమైనా సుకమైనా ఆయమ్మ కాడకే ఎల్తన్నారండి.

'పొన్నూర్ల సోమినాయిడు గోరింట్ల రెయిడింగు సేసినారండి. రొక్కం, ఎండి, బంగారం, అప్పు పత్తరాలు శానా దొరికినాయండి. నాయిడుని పట్నం తోలుకెల్లి జయిల్లో ఎట్టేసినారని సావుకవరు సల్లగ సెప్పేసినారండి సత్తెమ్మగోరు.

'సిమ్మాసెలంగోరు సెవట్లు ఎట్టేసుకున్నారండి. మరి కాల్సేతులు ఆడనేదండి. ఆ మట్న జాము రేతిర్న సత్తెవతమ్మ గోరింటికి పారొచ్చేసినారండి. రొక్కం, ఎండి, బంగారం, అప్పు పత్తరాలు సూటుకేసల ఎట్టి దెచ్చేసినారండి.'

'ఈ రెయిడింగు టయాంల ఇవి నీకాడయితె బద్దరంగా ఉంటాయి. నాను నిబ్బరంగ ఉంతాను. ఆపద కాయి అంటూ బతిమిలాడాడండి.'

'సత్తెవతమ్మగోరు మరి పెద్దోడి మాట కాదన్నేదండి. నాలుగో పొద్దు తెల్లారి రెయిడింగు పారిటీ సిమ్మాసెలం గోరింట్లో దిగేసినారండి. సందేల వోరకూ ఇల్లు వోకిలి ఎతికినారండి. ఏటీ దొరకనేదండి. పెద్దోల్లు వొచ్చినారు కూడు దిని ఎల్లండని కోడి కోసి కూడెట్టి ఆల్లని సాగనంపేసినాడండి.'

'వుసారుగా సత్తెవతమ్మగోరింటి కెల్నాడండి.'

'రొక్కం, ఎండి, బంగారం, అప్పు పత్తరాల సూటుకేసు వొట్టుకొచ్చెయ్యాలని.'

'అయితే ఆడేటుంది? సత్తెవతమ్మగోరు ఇల్లు కాలీగుందండి. సత్తెవతమ్మగోర కాని, ఆయిడ సామానుగాని నేదండి.'

'సిమ్మాసెలంగోరు కుదేలై పోయి తిరిగి సిమ్మాలు గోడయి పోనాడండి!!'

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక మే 3–9 1995